మినీ కథ:

# అడ్వెంచర్

అడ్వెంచర్లన్నా, ఆపదలో వున్న అందమైన ఆడపిల్లలను ఆదుకోవటమన్నా అప్రావుకు అంతులేని సరదా. మహా సరదా. అందుకే ఆ సరదాకుపోయి, అప్పుడప్పుడు ముప్పు తెచ్చిపెట్టుకోవటం కూడా ఓ హాబీయే.

ఆ రోజు ఆదివారం. ఏం చేయాలో తోచలేదు. మామూలుగా అయితే రోడ్డుమీద చక్కర్లు కొడుతూ యేవేవో అడ్వెంచర్లలోనో మునిగి తేలుతుండేవాడు. కాని యీ ఆదివారం వుదయంపూట ఆ అవకాశాలంతగా కనుపించలేదు.

కాని అంతమాత్రానికే క్రుంగిపోయే మనస్తత్వం కాదు అప్రావుది. పట్టువదలని విక్రమార్కుడేలిన దేశంలో పుట్టిన ఓటరు అప్రావు. ఫాదరాఫ్ ది నేషన్ దగ్గర్నుంచి పుచ్చుకున్న సహన ముందతడిలో. అంతెందుకు వున్నపాటున అప్రావును అమాంతం ఏ మాంసం కొట్టుకో తీసుకెళ్ళి కోస్తే, ఓ యాభై కిలోల మాంసం, పావుకిలో తెలివి, అరకిలో ధైర్యం, పాతిక్కిలోల ఓపిక, యాభై కిలోల దయాగుణం, జేబులో ఓ యాభై పైసల నాణెం తప్పకుండా కనిపిస్తాయి.

పైగా క్రితం రాత్రి చూసిన సినిమాలో రిక్షా లాగే హీరోను, రైలుబండి నడిపే....ఛ ఛ....కారు నడిపే హీరోయిను అమాంతం వాటేసుకుని లవ్వాడటం చూసిం దగ్గర్నుంచి అప్రావు వొళ్ళు కోడి శరీరంలా ఒకటే వెచ్చబడి పోవటం మొదలయ్యింది.

సిటీలో అటూ యిటూ తిరిగి, చెయ్యాల్సిన అడ్వెంచర్సేమీ కనిపించకపోతే, "లెటజ్ ట్రై అవర్ లక్" అనుకుని సిటీ పొలిమేరల్లోని కొచ్చాడు.

ఓ కొండరాయిమీద కూర్చుని, గలగల పారుతున్న కాలువనూ, గబ గబా పరుగెత్తుతున్న ట్రాఫిక్‌ను చూస్తూ కూర్చుండిపోయాడలా యెంతసేపో!

"హెల్ప్.... హెల్ప్...రక్షించండి....రక్షించండి" అన్న కేకతో వులిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుని యీ లోకంలోని కొచ్చాడు అప్రావు. కాలువ నడి ప్రవాహంలో కొట్టుకుపోతూ ప్రాణభయంతో అరుస్తుందో పిట్ట. చిలకో, కాకో, పిచుకో కాదు. అమ్మాయి. అసలు సిసలైన అమ్మాయి.

అప్పారావులోని సిక్త్ సెన్స్ చకచకా పన్జేసింది. "లే, లే....అవకాశం వుపయోగించుకో, నీ అడ్వెంచర్‌తో ఆమె ప్రాణాల్ని రక్షించు" అంది అప్రావు అంతరాత్మ.

"జై....అప్రావుకీ జై....ఓం" అంటూ యింకేమీ ఆలోచించకుండా కాలువలోనికి దూకేశాడు అప్రావు. బుడుంగున మునిగా డొక్కసారి. అప్పుడతనికి తెలిసొచ్చింది మొదటిసారిగా తనకు యీదటం రాదని.

—మునీర్

మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25

సం. చందా
రూ. 15/-